

పటిష్టంగా ఎన్నికల నియమావళి

నెల్లూరు :తూర్పు రాయలసీమ నియోజకవర్గ శాసనమండలి (ఎంఎల్‌సి) స్థానాలకు జరగనున్న ఎన్నికల దష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాల యంలో నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షా నిర్వహిం చారు. కమిషనర్ మాట్లాడుతూ 16 వ తేదీన చిత్తూరు - నెల్లూరు - ప్రకాశం పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి స్థానాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుందని, ఎన్నికల నియమావళి సూచించిన అన్ని అంశాలు నగర వ్యాప్తంగా అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ ఎస్.ఈ సంపత్ కుమార్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, టి.పి.ఓ ప్రసాద్ రావు, టౌన్ ప్లానింగ్ డి.సి.పి దశయ్య, తహశీల్దార్ నిర్మలానంద బాబా, ఎన్నికల విభాగం చక్రపాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ హరిత

వైసిపిలో 'స్థానిక' ఎంఎల్‌సి గోల..!

జిల్లాలో ఎంఎల్‌సిల ఎన్నికల హడావుడి నడుస్తోంది. టీచర్, గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 8న షెడ్యూల్ ప్రకటించింది. ఈనెల 16న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మార్చి 13న పోలింగ్, 16న ఓట్ల లెక్కింపు ఉంటుంది. 21వ తేదీకి ఎన్నికల ప్రక్రియ ముగుస్తోంది. ఇదే సమయంలో జిల్లాలో స్థానిక సంస్థల నుంచి ఎన్నికైన ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి పదవీ కాలం మార్చి 29కి ముగుస్తోంది. దీనికి సంబంధించి అభ్యర్థి ఎంపిక చేసే పనిలో వైసిపి ఉంది. జిల్లాలోని 95 శాతం స్థానిక సంస్థలు వైసిపి ఖాతాలో ఉండడం ఇది ఏకగ్రీవం కానుంది. అభ్యర్థి ఎవరనే విషయంపై ఆపార్టీ ఆరా తీసుకుంది. రాజకీయ సమీకరణలు చేస్తుంది. నేనంటే, నేను అంటూ కొందరు నేతలు రాజధాని చుట్టూ తిరుగుతున్నారు. ఆశావాహులు పెద్ద ఎత్తున వ్యూహాలు పన్నుతున్నారు. స్థానిక ఎంఎల్‌సి ఎవరిని వరిస్తోందో చూడాలి..

రాజధానికి క్యూ కడుతోన్న నేతలు - సమీకరణలో అధిష్టానం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలో ఖాళీకానున్న ఆరు గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికలతోపాటు, తెలుగు రాష్ట్రాల్లో ఎనిమిది స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. గురువారం తూర్పు రాయలసీమ నియోజకవర్గం కింద ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, జిల్లాల్లో గ్రాడ్యుయేట్, టీచర్స్ నియోజకవర్గంలో ఎన్నికలు జరగనున్నాయి. గత మూడు నెలల నుంచి జిల్లా వ్యాపితంగా ఓట్లు చేర్పు, మార్పులు ప్రక్రియ వేగంగా సాగుతోంది. ప్రస్తుతం గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిగా యండపల్లి శ్రీనివాసులురెడ్డి, టీచర్ ఎంఎల్‌సిగా విటపు బాలసుబ్రమణ్యం కొనసాగుతున్నారు. ఈ రెండు ఎంఎల్‌సితోపాటు స్థానిక సంస్థల ఎంఎల్‌సిని దక్కించుకోవాలని వైసిపి అధిష్టానం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తుంది. ఈ రెండు ఎంఎల్‌సిలు పిడిఎఫ్ సొంతం చేసుకుంటుంది. మూడేళ్ల నుంచి ఇక్కడ తిరుగులేని శక్తిగా ఉంది. మేధావులు, టీచర్లు, యువకులు చైతన్యవంతమైన ఓటర్లు పిడిఎఫ్ పక్షాన నిలుస్తున్నారు. ఇప్పటికే వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఉద్యోగులు రగిలిపోతున్నారు. యువత ఉద్యోగ అవకాశాలు లేని ఆగ్రహంతో ఉన్నారు. ప్రభుత్వం మాత్రం ఎలాగోలా ఈ రెండు ఎంఎల్‌సిలు దక్కిం చుకోడానికి అనేక కుయుక్తులు పన్ను తోంది. ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందో చూడాలి. ఈనెల 16న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది.

వైసిపిలో 'స్థానిక' గోల..!

వైసిపిలో ఎంఎల్‌సి అభ్యర్థి ఎంపిక విషయమై రసవత్తర చర్చసాగుతోంది. ఆరు సంవత్సరాల కాల పరిమితి ఉన్న స్థానిక సంస్థల ఎంఎల్‌సిగా సూళ్లూరుపేటకు చెందిన వాకాటి నారాయణరెడ్డి కొనసాగుతున్నారు. గతంలో కాంగ్రెస్, టిడిపిలో కొనసాగారు. ఇప్పుడు బిజెపి నేతగా ఉన్నారు. జిల్లాలోని స్థానిక సంస్థల నుంచి కొత్త ఎంఎల్‌సి ఎన్నిక కావాల్సి ఉంది. ఇటీవల జిల్లాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు వైసిపి సొంతం అయింది. ఇక్కడ ఎంఎల్‌సి ఏకగ్రీవం కానుంది. ఈ సీటు కోసం వైసిపిలో చర్చసాగుతోంది. కావలి ప్రాంతానికి చెందిన సుకుమార్, నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, వైసిపి నెల్లూరు రూరల్ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, గూడూరు ప్రాంతానికి చెందిన పొనకా శివకుమార్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. సామాజిక సమీకరణను ఆపార్టీ చూస్తుంది. ముక్కాల ద్వారకానాథ్‌కు ఇవ్వడం ద్వార వైశ్యులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు ఉంటుందని భావిస్తున్నారు. ఆనం విజయకుమార్‌రెడ్డికి ఇవ్వడానికి కొందరు అడ్డుపడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన భార్య ఆనం అరుణమ్మ, జెడ్పి ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఇలాంటి సమయంలో ఎంఎల్‌సి ఇచ్చే ఒకే కుటుంబంలో ఇద్దరికి పదవి ఇచ్చినట్లు ఉంటుందనే అభిప్రాయం వస్తుందని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఒక కుటుంబంలో ఒకరికే ఇవ్వాలని వైసిపి అధిష్టానం భావిస్తోంది. అభ్యర్థి విషయమై వైసిపి అధిష్టానం ఆరా తీసుకుంది. నేతల అభిప్రాయాలు తెలుసుకుంటుంది. ఎవరికి ఇస్తే వచ్చే ఎన్నికల్లో పార్టీకి ఉపయోగంగా ఉంటుందనే విషయంపై దృష్టి పెడుతున్నారు.

ఆనం విజయకుమార్‌రెడ్డి

రూప్‌కుమార్‌యాదవ్

సుకుమార్‌రెడ్డి

ముక్కాల ద్వారాకానాథ్

ఏం..ప్రజల్లో తిరగలేరా..!

ప్రభుత్వం గడప గడపకు కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారు. అందులో భాగంగా సోమవారం అమరావతిలో ఎంఎల్‌ఎలతో సిఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలను 20 మంది ఎంఎల్‌ఎలు వెనుకపడ్డారని ప్రకటించారు. అందులో జిల్లాలోని నెల్లూరు రూరల్, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఎంఎల్‌లు పార్టీ మారుతుండగా, ఉన్న ఉదయగిరి, నెల్లూరు సిటి ఎంఎల్‌ఎలు గడప గడప కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో నిర్వహించలేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మళ్లీ తొలి నుంచి ప్రారంభించాలని ఆదేశించినటు తెలిసింది.

మీ వల్ల నష్టం జరుగుతుంది - ఉదయగిరి, నెల్లూరుపై సిఎం సీరియస్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి ఎంఎల్‌ఎ సచివాలయాల్లో ఇంటింటికి తిరగాల్సి ఉం టుంది. ఎంఎల్‌ఎ పనితీరు ఎలా ఉంది ?. రోజు వెళతున్నారా ? ఎన్ని గంటలు తిరుగు తున్నారు? అనే విషయాలను ముఖ్యమంత్రి ,ఆయన టీమ్ పర్యవేక్షిస్తుంది. ఐప్యాక్, టీమ్ ప్రతి జిల్లాలోనూ తిరుగుతున్నారు. ఈ నివేదికను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రికి, సజ్జల రామకృష్ణారెడ్డికి ఇస్తున్నారు. సోమవారం విజయవాడలో ఎంఎల్‌ఎలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

విజయవాడలో జరిగిన సమీక్షలో ఎంఎల్‌సి అభ్యర్థులను పరిచయం చేస్తున్న సిఎం జగన్

రాష్ట్ర వ్యాపితంగా 20 మంది ఎంఎల్‌ఎల పనితీరు బాగాలేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఇద్దరు ఎంఎల్‌ఎల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. నెల్లూరు నగర ఎంఎల్‌ఎ పి. అనిల్ కుమార్‌యాదవ్, ఉదయగిరి ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఇద్దరు నిర్దేశించిన మేరకు కార్యక్రమం నిర్వహించలేదన్నారు. ఎంఎల్‌ఎ అనిల్‌కుమార్ యాదవ్ గడపగడపకు తిరుగుతున్నా స్థానికంగా ఉన్న పార్టీ విబేధాల కారణంగా అన్నిచోట్లకు వెళ్లడంలేదు. కొన్ని డివిజన్‌లో మాత్రమే ఆయన తిరుగుతు న్నారు. పార్టీలో నెలకొన్న విభేదాలు తగ్గించడానికి వైసిపి అధిష్టానం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఉదయగిరి ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖ ర్‌రెడ్డి పరిస్థితి ఇలానే ఉంది. స్థానిక నేతల సహకారం లేకపోవడం, గ్రూపుల కారణంగా నియోజ కవర్గంలో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిం చడం లేదని తెలుస్తోంది. ఈ రెండు నియోజ కవర్గంలో ఇప్పటి వరకు ఉన్న మొత్తం పనితీరును జీరో చేశారు. తొలి నుంచి మళ్లీ తిరగాలని చెప్పినట్లు తెలిసింది. ఈ రెండు నియోజకవర్గాల పనితీరుపై సీరియస్ అయినట్లు తెలిసింది. వెంకటగిరి ఎంఎల్‌ఎ ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడి శ్రీధర్‌రెడ్డి పార్టీని వీడనుండడంతో అక్కడ ఇన్‌ఛార్జ్‌లు కార్యక్రమం నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ పని తీరును మెరుగుపరు చుకోకుండా కేవలం గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంపైనే సిఎం, దృష్టి పెట్టడం పల్ల ఆపార్టీ నేతలు, కార్యకర్తల్లో అసహనం వ్యక్తం అవుతోంది.

భూసేకరణ పనులు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలో చేపడు తున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధి ంచిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారులకు, పోర్టులు, రైల్వే, పరిశ్రమల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్లో వున్న భూసేకరణ ప్రక్రియపై కలెక్టర్ చక్రధర్ బాబు, జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్ తో కలిసి రెవెన్యూ డివిజన్ అధికారులు, సంబంధిత ప్రాజెక్టుల ఇంజనీరింగ్ అధి కారులతో సమావేశం నిర్వహించి డివిజన్ల వారీగా సుదీర్ఘంగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు మంజూరైన వివిధ ప్రాజెక్టులకు కావాల్సిన భూములను సేకరించడంలో రెవెన్యూ అధి .కారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి ప్రాజెక్టు వారీగా నిర్దిష్టమైన గడువును నిర్ధారించుకొని ఆ గడువులోగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసేలా రెవెన్యూ అధికారులు దష్టి సారించాలన్నారు. కందుకూరు సబ్ కలెక్టర్ ఎస్.ఎస్. శోబిక, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారా యణమ్మ, నెల్లూరు, కావలి,ఆత్మకూరు ఆర్.డి.ఓ లు మలోల, శీనా నాయక్, కరుణకుమారి, రామా యపట్నం పోర్టు లైజనింగ్ అధికారి ఐ.వి.రెడ్డి, ఏపీఐఐసీ, ఆర్.అండ్ బి., రైల్వే, నేషనల్ హై వే అధికారులు ఉన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి -వెంకటాచలం :విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలో మొత్తం 12,088 మంది విద్యార్థులకు గానూ 10804 మంది హాజరయ్యారు. ఈ పరిక్షలకు 1284 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా పలువురు డీబార్ అయ్యారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పరీక్షలు నిర్వహించారని పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు.

17 నుంచి బ్రహ్మోత్సవాలు

పొదలకూరు: పొదలకూరులోలోని శ్రీ కామాక్షితాయి రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీ నుంచి జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను సోమవారం మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి నెల్లూరులోని తన నివాసంలో ఆవిష్కరించారు. శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ తన్నీరు సుబ్రహ్మణ్యం, ఆలయ ఈవో కుడారి పెంచలవర ప్రసాద్, పోలేరమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మొలబంటి శేఖర్, ఆలయ పాలకమండలి సభ్యులు దాది బత్తిన భాస్కర్ రెడ్డి, వైకాపా నాయకులు సోమా భాస్కర్, వూకోటి లక్ష్మీనారాయణ,చొప్పా వెంకటేశ్వర్లు ఉన్నారు.

పూర్వ విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి - లింగసముద్రం : రెండు వేల కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించి అమరవీరులకు నివాళులర్పించిన కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి గోసుల కీర్తినాయుడును పాఠశాల హెచ్‌ఎం కె. సూర్యప్రకాశ్‌రావు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. 2023 జనవరి 1న ఒంగోలు నుంచి ఢిల్లీ వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. రోజుకు 95 కిల్లోమీటర్ల చొప్పున 24 రోజులు రెండు వేల కిల్లోమీటర్లు ప్రయాణించి 2019 ఫిబ్రవరి 14న పుల్వామా దాడిలో అమరులైన భారతీయ వీరజవానులకు నివాళి అర్పించారు. కీర్తినాయుడుని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కీర్తినాయుడుని సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి...

ప్రజాశక్తి -రాపూరు :వెంకటగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి శీ కురుగొండ్ల రామకష్ణ సూచనల మేరకు రాపూరులోని మల్లమ్మ గుంటలో టిడిపి పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ ముక్తార్ ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వంలో పెట్రోలు, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపో యాయని విమర్శించారు.రాపూరు టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ ముక్తార్, మండల మైనార్టీ అధ్యక్షులు 69వ బూత్ కన్వీనర్ షేక్ గౌస్ బాషా, మల్లికా పెంచలయ్య, సయ్యద్ జ్యోతి, సిరిపురం రాజా పాల్గొన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు అంకమ్మ తల్లి ఆలయం పునర్నిర్మాణం పనులు ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్మాణ కమిటీ సభ్యుల నిరంతర పర్యవేక్షణలో శరవేగంగా జరుగుతున్నాయి. సోమవారం అరటి పాముల మహేష్ కుమార్ భార్య నాగ మల్లేశ్వరి, వారి కుమారులు కుమార్తెలు సువర్ణ యంత్రానికి రూ.5116లు, విరాళాగా కమిటీ సభ్యులకు అందజేశారు. మంచిరాజు మురళీమోహన్, కొండూరి వసంతరావు, అర్చక స్వామి పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - లింగసముద్రం : మహాశివరాత్రి సందర్భంగా లింగసముద్రంలోని కోటయ్య సమాధి వద్ద, మొగిలిచర్ల దత్తాత్రేయ స్వామి వద్ద తిరునాళ్ల ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా రెండు ప్రాంతాల్లో ఆలయ కమిటీ వారు చేస్తున్న ఏర్పా ట్లును గుడ్లూరు సిఐ సుబ్బారావు సోమవారం పరి శీలించారు. రెండు చోట్ల పార్కింగ్ స్థలాలను చూసి ఆలయ కమిటికి పలు సూచనలు చేశారు. దత్తాత్రేయస్వామి దేవాలయం ధర్మకర్త పవని నాగేంద్ర ప్రసాద్‌తో మాట్లాడి శివరాత్రి బందోబస్తు గురించి చర్చించారు. ఆయన వెంట లింగ సముద్రం ఎస్‌ఐ ఆవుల వెంకటేశ్వర్లు, వలేటివారిపాలెం ఎస్‌ఐ సుదర్శన్ ఉన్నారు.

మిలటరీ కాలనీలో చోరీ

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని న్యూ మిలటరీ కాలనీ ప్రాంతంలోని ఓ ఇంట్లో సోమవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. వేదాయపాళెం పోలీసుల వివరాల మేరకు కాంట్రాక్టర్ సిహెచ్ ప్రసన్న కుమార్‌రెడ్డి కాంట్రాక్ట్ పనులపై చెన్నైలో ఉన్నారు. ఆయన నివాసంలో ఆయన తండ్రి, కుమార్తె ఉంటున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు ముసుగులు ధరించి ఇంట్లోకి వెళ్లారు. ఉన్న ప్రసన్నకుమార్‌రెడ్డి తండ్రిని, కుమార్తెను నిర్బంధించి బెదిరిం చారు. ఇంట్లో ఉన్న 10 సవర్ల బంగారు ఆభరణాలు, 55వేల రూపాయల నగదును దోచుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా హుటాహుటిన పోలీసులు అక్కడకు చేరుకున్నారు. క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలను సేకరించారు. డాగ్ స్క్వాడ్ కూడా పరిశీలించింది. కేసు దర్యాప్తు సాగుతోంది.

'మూర్ఛ' వ్యాధి నివారణపై అవగాహన

నెల్లూరు :ఆధునిక శస్త్ర చికిత్స ద్వారా మూర్ఛవ్యాధిని పూర్తిగా నయం చేయగలుగు తున్నామని నారాయణ హాస్పిటల్ న్యూరాలజి విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఎస్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ మూర్ఛవ్యాధి అవగాహన దినోత్సవాన్ని పురస్కరిం చుకొని నారాయణ ఆస్పత్రిలోని బి.సి రాయ్ గ్యాలరీలో పి.ఎం.పి అసోసియేషన్ సభ్యులకు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు మూర్ఛ వ్యాధి గ్రస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో డాక్టర్ ఎస్.ఎస్. సంపత్ కుమార్ మాట్లాడుతూ గతంలో మూర్ఛ వ్యాధిగ్రస్తులు స్వేచ్ఛాయుత జీవితాన్ని గడపలేక, మానసికంగా కంగిపోతుండేవారన్నారు. ఈ అనారోగ్య సమస్యతో బాధపడే వారు ఉన్నత చదువులు చదువుకోవాలన్నా, వైవాహిక జీవితంలో అడుగు పెట్టాలన్నా ఇబ్బంది పడేవారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు ఆ సమస్యను సమూలంగా రూపుమాపే సరికొత్త వైద్య విధానాన్ని నారాయణ హాస్పిటల్ యాజమాన్యం అందుబాటులోకి తీసుకొచ్చిం దన్నారు. సుమారు 50 మంది వరకు ఈ శస్త్రచికిత్సలు చేయించుకుని సాధారణ జీవితాన్ని గడుపుతున్నారన్నారు. మూర్ఛవ్యాధి ఎలా వస్తుంది, మూర్ఛ వ్యాధి లక్షణాలు తదితర అంశాలను డాక్టర్ ఎస్.ఎస్ సంపత్ కుమార్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. హరిప్రసాద్ రెడ్డి మాట్లాడారు. అనంతరం డాక్టర్ ఎస్ఎస్ సంపత్‌కుమార్‌ను పిఎంపి అసోసియేషన్ సత్కరించారు. పి.ఎం.పి అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు అనుమల జయప్రకాశ్, పి.ఎం.పి జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ , నారాయణ హాస్పిటల్ ఏజీఎం, భాస్కర్ రెడ్డి , పి.ఎం.పి నాయకులు గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, పొదిలి మోహన్ పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

పథకాల అమలులో భేష్..

ప్రజాశక్తి-నెల్లూరు :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న అనేక పథకాల అమలులో జిల్లా పనితీరు చాలా బాగుందని జాతీయ పర్యవేక్షక కమిటీ సభ్యులు అంబటి శ్రీనివాసరావు, కిరణ్ పేర్కొన్నారు. పది రోజులపాటు జిల్లాలోని వివిధ గ్రామాల్లో పర్యటించిన కమిటీ సభ్యులు సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాల యంలో కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో తాము పరిశీలించిన అంశాలను కలెక్టర్ దష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పింఛన్లు, ఉపాధి హామీ, స్వయం సహాయక బందాల పనితీరుపై లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడి అనేక పథకాల అమలు తీరును పరిశీలించించినట్లు కమిటీ సభ్యులు కలెక్టర్ కు వివరించారు. డి ఆర్ డి ఏ, డ్వామా, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, వెంకట దాస్, జెడ్పి సిఈవో చిరంజీవి ఉన్నారు.

యువగళం పాదయాత్రలో 'ఇంటూరి'

ప్రజాశక్తి -కందుకూరు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం నగరి నియోజకవర్గంలో కొన సాగింది. ఆ పార్టీ కందు కూరు నియో జకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ఉదయం లోకేష్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పాదయాత్ర జరుగుతున్న తీరు, రోజురోజుకీ పెరుగుతున్న ప్రజాదరణపై చర్చించారు. కందుకూరు నియోజ కవర్గంలో పార్టీ కార్యక్రమాలు జరుగుతున్న తీరును కూడా లోకేష్ అడిగి తెలుసుకున్నారు. లోకేష్‌తో కలిసి, ఉదయం నుంచి నగరి నియోజ కవర్గంలో జరిగిన పాదయాత్రలో నాగేశ్వరరావు వరుసగా రెండో రోజు కూడా పాల్గొ న్నారు. కందుకూరు పట్టణ, ఉలవపాడు మండల టిడిపి నాయకులు నాగేశ్వరరావుతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు.

లోకేష్‌తో కలిసి పాదయాత్రలో నడుస్తున్న ఇంటూరి

పొగాకు రైతులకు అవగాహన

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరు రెండో పొగాకు వేలం కేంద్రం పరిధిలోని నందనవనం, పలుకూరు, నరిశెట్టి వారి పాలెం, కోవూరు గ్రామాలను రైతు మిత్ర బందం సభ్యులు పొగాకు బోర్డు, ట్రేడ్ మిత్రులు సోమవారం పొంగతోటను సందర్శించారు. ఈ సందర్భంగా వారు తోటలలో అంతర సేద్యం చేయాలని, దీనివల్ల పంట ఏపుగా పెరుగుతుందని రైతులకు సూచించారు. పొగ తోటలలో లింగకార బట్టలు, జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని తెలిపారు. తోటలలో అంచులలో బంతి మొక్కలు, జొన్న, ఆముదం వేయాలని సూచించారు. చీడపీడల నివారణకు సూచనలు చేశారు. నాణ్యమైన పొగాకు పండించాలని తెలిపారు. అక్షన్ సూపరింటెండెంట్ సిద్ధరాజు, సిటిఆర్ఐ హెడ్ అనురాధ, ఐటీసీ మేనేజర్ వెంకట రావు, జిపిఐ మేనేజర్ ఉన్నం శ్రీనివాసరావు, ఎఓఐ మేనేజర్ ప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్రావు పాల్గొన్నారు.

పొగాకు తోటను పరిశీలిస్తున్న అధికారుల బృందం

సాధారణ కాన్పులకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలో సాధారణ కాన్పులకు ప్రాధాన్యత నివ్వాలని, సిజేరియన్ ఆపరేషన్లు అధికంగా జరుగుతున్నాయని, ఈ తరహా ఆపరేషన్లు జరగడానికి గల కారణాలు ఏమిటని ప్రయివేట్ వైద్యశాలల యాజమాన్యాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ప్రశ్నించారు. సోమవారం నగరంలోని డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాల యంలో జిల్లాలోని ప్రయివేట్ వైద్యశాలల యాజ మాన్యాలతో సమీక్షా సమావేశం నిర్వహి ంచారు. డిఎంఅ ండ్‌హెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో సాధారణ కాన్పులు జరిగేలా గైనకాల జిస్టులు కృషి చేయాలని సూచించారు. ఐఆర్ఎడి (ఇ రాడ్) యాప్‌లో రోడ్డు ప్రమాదాలు గురైన వారి వివరాలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. డెమో శ్రీనివాసరావు, ఎస్ఓ సహన,డాక్టర్ సునీల్, హెచ్ఈఈఓ నరసింహరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సునీత,సూపర్ వైజర్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. వరిగొండ పంచాయతికి చెందిన సుమారు రూ. 50 లక్షల విలువైన భూమి ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. వివరాల మేరకు కాకుపల్లికి సమీపంలో ముత్తుకూరుకు వెళ్లే ఆర్అండ్ బి రోడ్డుకు ఆనుకుని సర్వే నెంబర్ 773/1లో 1.50 ఎకరం విస్తీర్ణంలో నెల్లూరుకు చెందిన ఓ రియల్టర్ లే అ వుట్ సిద్ధం చేసి ప్లాట్లు నిర్మించాడు. ఆ ప్లాట్లలోకి వెళ్లేందుకు దారి కోసం ఆ వ్యాపారి వరిగొండ పంచాయతీకి చెందిన దాదాపు 25 సెంట్ల భూమిని ఆక్రమించి రోడ్డు నిర్మించారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు ఎందుకు ఉదాసీనంగా ఉన్నారో అర్థం కావడం లేదంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పంచాయతీ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ భూమిలో రోడ్డు వేసిన దృశ్యం

సర్వే చేసి నిర్ధారిస్తాం..

ఆ ఆక్రమణ వ్యవహారంపై పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ దృష్టికి వెళ్లింది. ఆయన స్పందిస్తూ 773/1 సర్వే నెంబర్‌లో పంచాయతీకి చెందిన భూమి అక్రమణకు గురైందా లేదా అనేది సర్వే చేసి నిర్ధారిస్తామన్నారు. ఆక్రమణ జరిగి ఉంటే స్వాదీనం చేసుకొంటామని శ్రీధర్ పేర్కొన్నారు.

సరోజినినాయుడు సేవలు మరువలేనివి..

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం సోమవారం జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించిన ఐక్యుఎసి కో ఆర్డినేటర్ డాక్టర్ పి రాజ గోపాల్ బాబు మహిళా దినోత్సవ నేపథ్యాన్ని వివరించారు. సరోజినీ నాయుడు మంచి రచయిత అని, ఆమె సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలను దష్టిలో పెట్టుకొని రచనలు చేసిన సామాజిక విప్లవ కారిణి అని పేర్కొన్నారు అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ శంకర్రావు మాట్లాడుతూ స్త్రీలు పురుషాధిక్య సమాజపు పోకడలకు గురికాకుండా తమకు తాముగా ఆలోచించాలని, రక్షణ కల్పించుకోవాలని సూచించారు. సరైన దిశలో ఆలోచిస్తే ప్రతి మహిళ సరోజినీ నాయుడులా అభివద్ధి చెంది గుర్తింపును తెచ్చుకుంటారని చెప్పారు. మహిళా సాధికారతా విభాగం కన్వీనర్ షేక్ షానాజ్ బేగం మాట్లాడుతూ సరోజినీ నాయుడు ఎదుగుదల గురించి వివరించారు. మహిళా సాధికారత విభాగం సభ్యులు మైత్రి, డాక్టర్ కే సుజాత, డాక్టర్ పద్మావతి, డాక్టర్ అనూష ,ఎం జ్యోతి, ,ఇంద్రజ మొదలైన అధ్యాపకులు తమ తమ సందేశాలను వినిపించారు.

సోషల్ టీచర్‌ను నియమించాలి : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు :రూరల్ మండల పరిధిలోని వెల్లంటి పాఠశాలలో సోషల్ టీచర్‌ను వెంటనే నియ మించాలంటూ సిపిఎం రూరల్ కమిటీ జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్ఎస్ గంగాభవానికి వినతిపత్రం అందజేసింది. ఆ పార్టీ రూరల్ మండల కార్యదర్శి ఆలూరి తిరుపాలు మాట్లాడుతూ సోషల్ సబ్జెక్టు బోధన చేసేందుకు ఉపాధ్యాయుడు లేకపోవడం కారణంగా గత ఏడాది ఈ పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలకు 46 మంది విద్యార్థులు హాజరు కాగా, 22 మంది ఈ సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారన్నారు. ఈ విద్యాసంవత్సరం దాదాపుగా పూర్తియిందని, పరీక్షలు దగ్గర పడుతున్నాయని సోషల్ సబ్జెక్టుకు టీచర్ లేకపోతే విద్యార్థులు నష్టపోతారన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే సోషల్ టీచర్‌ను నియమించాలన్నారు. విద్యా కమిటీ చైర్మన్ గంగాల వెంకట రమణయ్య, సిపిఎం నాయకులు పూడిపర్తి జనార్ధన్, పాదర్తి మస్తాన్, పాదర్తి నారాయణ, ఎం వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కనీస పింఛన్ రూ. 9 వేలు ఇవ్వాలి

ఇపిఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు :కనీస పెన్షన్‌గా రూ.9వేలు అందజేయాలని, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు ఏడాదికి రెండు సార్లు కరువు భత్యం అందజేస్తున్నట్లు తమకు అందజే యాలని ఎపిఆర్‌పిఎ (ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం నగరంలోని ఈపిఎఫ్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్లు ధర్నా చేపట్టారు. అనంతరం ఈపిఎఫ్ కార్యాలయ అధికారికి తమ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఏపిఆర్‌పిఎ జిల్లా కార్యదర్శి జి.చంద్రమౌళి మాట్లాడారు. రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్ నాగభూషణం, కోవూరు షుగర్స్, నిప్పో పరిశ్రమల, సివిల్ స్లపయిస్, ఆర్‌టిసి,పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ కందుకూరు వారి ఆధ్వర్యంలో పేదవారి కోసం కందు కూరులో నిస్సహాయలులైన 40 మంది వద్దులను, వికలాం గులను గుర్తించి సోమ వారం భోజన ప్యాకెట్లు అందించారు.ప్రతి ఒక్కరు తమ సామాజిక బాధ్యతగా పేదలకు ఆపన్నహస్తం ఇవ్వాలని ఫౌండేషన్ సెక్రెటరీ షంషేర్ పేర్కొన్నారు. ప్రెసి డెంట్ సాజిద్, ట్రెజరర్ హఫీజ్, ఇన్‌ఛార్జి అయూబ్ ఖాన్ పఠాన్, షంషుద్దీన్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని 16వ డివిజన్ గుర్రలమాడుగు పలు ప్రాంతల్లో తాగునీటి రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికార పార్టీ నాయ కులు కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని సిపిఎం నాయకులు మున్సిపాలిటీ వాటర్ ట్యాంక్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో 16వ డివిజన్ సిపిఎం కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, స్థానికులు యశోదమ్మ, రాధమ్మ,రాజేష్, వెంకటేశ్వర్లు, రమణయ్య, తదితరులున్నారు.

గోతాలు అందుబాటులోకి తేవాలి

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-కోవూరు : ఆర్‌బి కేంద్రాల్లో గోతాలు అందుబాటులోకి తేవాలని ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీతా పొలయ్య భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ రైతులకు వరి కోతలు ప్రారంభమయ్యాయన్నారు. సమావేశంలో రైతు సంఘం మండల నాయకులు ఎస్‌కె బాబు, గండవరపు బుజ్జయ్య, వవ్వేటి మల్లికార్జునరెడ్డి, కృష్ణయ్య, సురేష్, వెంకటేశ్వర్లు, మురళి, సుబ్బారావు, శ్రీనివాసులు, సురేంద్ర పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్ మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు పేర్కొన్నారు. తాళ్లపాలెం పంచాయతీ, జువ్విగుంటపాలెం గ్రామంలో సోమవారం "ఇదేమి ఖర్మ రాష్ట్రానికి" కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని 24వ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బానాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి జాడలు కనిపించడం లేదని, గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి టిడిపి ప్రభుత్వం హయాంలో వేలకోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. వైసిపి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఒక్క రోడ్డు కూడా బాగు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో కావలి రూరల్ మండల టిడిపి అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, తాళ్లపాలెం పంచాయతీ టిడిపి ముఖ్య నాయకులు కోసూరి వెంకటేశ్వర్లు, మక్కి శ్రీహరి, బండ్ల వేణు, కమతం ప్రసాద్, పులి సుధాకర్, పెనుబాపల వెంకటేశ్వర్లు, వాయిల శ్రీనివాసులు, పులి రమేష్‌యాదవ్, వాయిల్ల తిరుపతి, కాటంగారి వెంకటరమణ, ఉప్పల నారాయణ, దినేష్, వెనామి తిరుపతి, రఫీ, బట్లదిన్నె వెంకటేశ్వర్లు, తాళ్లపాలెం యువత మక్కి హరికృష్ణ, మక్కి నరేంద్ర, నలమోతు శ్రీనివాసులు, పాల రాజేష్, గట్టాల నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించని ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతారామపురం : ఇళ్ల లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని చెప్పి నిర్మాణాలు చేపట్టకుండా వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మండల టిడిపి నేతలు ధ్వజమెత్తారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటి నివేదన స్థలాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి 21 లే అవుట్‌లను తయారు చేయించి సుమారు 666 మందికి పట్టాలు పంపిణీ చేసి సరిపెట్టారాని, ప్రభుత్వం ఏర్పడి 4 సంవత్సరాలు గడుస్తున్నా ఇళ్ల నిర్మాణం వైపు ఒక్క అడుగు వేయకుండా ఇంకా మాయమాటలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టే ధోరణిలో వైసిపి ప్రభుత్వం ఉందని దానిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు కప్పా ప్రభాకర్‌రాజు, సర్పంచి కోడవటికంటి భాగ్యమ్మ, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, సీనియర్ నాయకులు నేలటూరి జాషువా, వెంగలసెట్టి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

తల్లి ప్రేమ గొప్పది..

ప్రజాశక్తి-బిట్రగుంట : సృష్టిలో తల్లి కన్న మించిన వారు మరొకరు లేరని రామిశెట్టి వెంకట సుబ్బారావు ట్రస్ట్ నిర్వాహకులు మెతుకు రాజేశ్వరీ అన్నారు. కొండ బిట్రగుంటలోని బండవారు కాలనీలో జాతీయ మహిళా దినోత్సవం, రామిశెట్టి వెంకటసుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మెతుకు రాజేశ్వరీ తల్లి కత్తి సులోచనమ్మ 9వ వర్ధంతి సందర్భంగా పేదలకు దుస్తులు, భోజనం, పండ్లు పంపిణీ చేశారు. సరస్వతి నమస్తుభ్యం వృద్ధాశ్రమం వ్యవస్థాపకులు మద్దులూరి ప్రసాద్ రావు, గిరిజన నాయకుడు జయంపు అశోక్, వెంకటేశ్వర్లు, ఎం.రమేష్‌బాబు, తదితరులున్నారు.

అధికారులతో ఎంపిడిఒ సమీక్ష

ప్రజాశక్తి-అల్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఎఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఒ శ్రీదేవి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌డిజి సర్వే ఆయుష్మాన్ భారత్ సర్వేలపై ఆరా తీసి పలు విషయాలను వెల్లడించారు. ఎంఎల్‌సి ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ అమలులో ఉందని ప్రతిఒక్క అధికారి ఇది గమనించాలని కోరారు. ఇఒపిఆర్‌డి పెంచలరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మురళీకృష్ణ, రామారావు, వర్షప్రసాద్ తదితరులున్నారు.

ఒట్టూరు మోడల్ స్కూల్లో పరీక్షలు

ప్రజాశక్తి-కావలి : కావలి మండలం ఒట్టూరు ఆంధ్రప్రదేశ్ మోడల్ పాఠశాలలో సోమవారం 'పరీక్ష పర్వ్ 4.0' కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ డైట్, పల్లిపాడు ఉప న్యాసకులు కె.విజయచంద్ర ఈ కార్యక్రమానికి జిల్లా సమన్వయకర్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యా విభాగాలు (ఎన్.సి.ఇ.ఆర్.టి., ఎస్.సి.ఇ.ఆర్.టి.), బాలల హక్కుల సంఘాలు (ఎన్‌సిపిసిఆర్, ఎపి ఎస్‌సిపిసిఆర్) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పదవ తరగతి విద్యార్థులలో పరీక్షల పై భయాన్ని, ఆందోళనలను పోగొట్టడం, ధైర్యంగా పరీక్షలు వేడుకలాగా విద్యాసంస్థలలో నిర్వహించడమే ధ్యేయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గవర్నమెంట్ డైట్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో లెక్చరర్లు సమన్వయకర్తలుగా 11 నుండి 20 తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 3 డివిజన్లలో వివిధ యాజమాన్యాలకు చెంది 10 పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రధానాచార్యులు ఇందిర, అధ్యాపకులు శ్రీహరి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం

ప్రజాశక్తి-సంగం : సంగంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్‌ను సోమవారం డిసిసిబి సిఇఒ శంకర్‌బాబు, డిసిఒ తిరుపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీలో రైతులకు, కస్టమర్లకు అన్ని వసతులు ఏర్పాటు చేయడమే లక్ష్యమని తెలిపారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మొట్టమొదటిగా సంగంలో పెట్రోల్ బంక్ ప్రారంభించామన్నారు. త్వరలో మరిన్ని సొసైటీల్లో పెట్రోల్ బంకులు ప్రారంభిస్తామని తెలిపారు.

రోడ్డు మరమ్మతుల పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సీతారామపురం : రానున్న మహాశివరాత్రి పురస్కరించుకొని మండలంలోని ఘటిక సిద్ధేశ్వరం రోడ్డు మరమ్మతుల పనులను మండల వైసిపి కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఘటిక సిద్ధేశ్వరం వెళ్లే భక్తులకు ఇబ్బంది లేకుండా రోడ్డుకి ఇరువైపుల చెట్లు ఎక్కువగా ఉండటం, అక్కడక్కడ రోడ్డు గుంతలమయం కావడంతో శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి సిద్ధేశ్వరం వెళ్లే భక్తులకి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పొలంగారిపల్లి నుండి సిద్ధేశ్వరం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి రోడ్డును సరిచేసేలా చూడాలని తెలపగా పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బసిరెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు చిన్నపరెడ్డి తిరుపతిరెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు కన్వీనర్ బాలినేని మాలయ్య, వేమన్న చెరువు ఉప సర్పంచ్ లక్కి బ్రహ్మయ్య, సోడా జనార్ధన్ రెడ్డి, గోపి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి-కావలి : మార్చి 5న జరిగే ఢిల్లీలో జాతీయస్థాయి జూనియర్ బాడీ బిల్డింగ్ క్రీడా పోటీలు జరుగనున్నాయని జిల్లా బాడీ బిల్డర్స్ ప్రధాన కార్యదర్శి వి జనార్ధన్ ప్రకటనలో తెలియజేశారు. ఇందుకోసంగా భీమవరంలో ఫిబ్రవరి 19వ తేదీ ట్రయల్ సెలక్షన్స్ జరుగుతున్నట్లు తెలిపారు. 21 సంవత్సరాలు లోపు మెన్ అండ్ ఉమెన్ పాల్గొనవచ్చునన్నారు. జిల్లా నుంచి వెళ్లే క్రీడాకారులు పూర్తి వివరాల కోసం ఎస్‌ఎస్‌ఏ నెల్లూరు జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సంప్రదించాలని కోరారు. ఇందుకోసంగా అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ముజీబ్ సెల్‌నెంబర్ 9848583947ను సంప్రదించాలన్నారు.

జెవివి సైన్స్ డే పోటీలు ప్రారంభం

మాట్లాడుతున్న జెవివి అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కావలి

కావలి రెడ్‌క్రాస్ భవనంలో సోమవారం నుండి అత్యంత విజయవంతంగా జాతీయ సైన్స్ దినోత్సవ పోటీలను జనవిజ్ఞాన వేదిక కావలి పట్టణశాఖ ప్రారంభించింది. సోమవారం జరిగిన వ్యాస రచన పోటీలో జూనియర్స్ - సీనియర్స్ విభాగాల్లో 120 మంది ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు పాల్గొన్నారు. పోటీలను పట్టణ శాఖ అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు తమ సందేశంతో ప్రారంభించారు. 21వ శతాబ్దం చేరేనాటికి మానవ సమాజం శాస్త్రీయ దృక్పథంతోనే పలు వైజ్ఞానిక పరిశోధనలతో ప్రగతిపథంలో పయనిస్తున్న మూఢ విశ్వాసాలు అడ్డుపడుతున్నాయన్నారు. భావి పౌరులైన బాలలలో శాస్త్రీయ ధోరణిని పెంపొందించి ఉత్తమ పౌరసమాజం నిర్మించేందుకే ఈ పోటీలు పెడుతున్నామన్నారు. గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.రవికుమార్ మాట్లాడుతూ బాల్యం నుండే మూఢనమ్మకాలను విడనాడే ఆలోచనలను పెంచుకోవాలని, చంద్రుడిపై పరిశోధనలు జరుపుతున్న సైన్స్ యుగంలో మగ పిల్లవాడు పుట్టాలంటే చెవిలో పసరు పోయించుకోవాలనే మూఢవిశ్వాసంతో కొందరు ఆలోచించడం విచారకరమన్నారు. కార్యవర్గ సభ్యురాలు సి.శారద మాట్లాడుతూ పోటీల వారోత్సవాలలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని విజేతలు కావడమేగాక తాము ఇచ్చిన అంశాలైన ప్రకృతి రక్షణ - మన సంరక్షణ, నిత్య జీవితంలో సైన్స్ వంటివి, విద్యార్థుల్లోని సహజ ప్రతిభను వెలికితీస్తుందని అలాంటి ఆలోచనతో ప్రత్యేక అంశాలు ఇవ్వడం జరిగిందన్నారు. మంగళవారం జరిగే వక్తృత్వ పోటీలు ఉదయం 9.30కు ఖచ్చితంగా ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులు సకాలంలో పోటీల స్థలం, రెడ్‌క్రాస్ భవన్‌కు చేరుకోవాలన్నారు. సెక్రటరీ జి.హరనాధ్, జాయింట్ సెక్రటరీ ఖాదర్‌బాషా, శ్రీకర్ల వెంకయ్య, కె.జాన్, శేషయ్య, బండికోటి చలపతిరావు, వెన్యూ ఇన్‌ఛార్జి హరినారపరెడ్డి తదితరుల సందేశాల అనంతరం 10 గంటల నుండి 11 గంటల వరకు వ్యాసరచన పోటీ దిగ్విజయంగా నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తమ పిల్లలను ప్రోత్సహించి పోటీలను విజయవంతం చేయాలని కోరారు. 15న చిత్రలేఖనం, 16న శాస్త్రీయ జానపద నృత్య పోటీలు, 17న సందేశాత్మక పాటలపోటీలు జరుగుతాయన్నారు. ఆఖరు రోజున సైన్స్ క్విజ్ జరుగుతుందని అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి టంగుటూరు సుబ్బరామశర్మ, విశ్రాంత ఎంఇఒ కల్లయ్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దర్గా పీఠాధిపతి పదవి నుంచి
హాఫీజ్‌ను తొలగించాలి : ఐద్వా

వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్/ఎఎస్‌పేట

పలు కేసుల్లో నిందితుడైన ఎఎస్‌పేట దర్గా పీఠాధిపతి హాఫీజ్‌పాషాను పదవి నుండి తొలగించి వక్ఫ్‌బోర్డ్ ఆధీనంలో కొనసాగించి దుర్గా పవిత్రతను కాపాడాలని ఐద్వా మహిళా సంఘం పేర్కొంది. సోమవారం ఎఎస్‌పేట దర్గా ప్రాంగణంలో పలు వీధుల్లో ఐద్వా మహిళా సంఘం నాయకుల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో మౌన దీక్ష ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ మాట్లాడుతూ మాట్లాడుతూ ఎఎస్‌పేట మండల కేంద్రంలో వెలసివున్న ఖాజానాయక్ రసూల్, దొరసానమ్మ దర్గా సజ్జాదెయే నషీన్ (దర్గా పీఠాధిపతి) పవిత్రమైన స్థానంలో ఉండి దర్గాకు మానసిక రోగులు, దర్గాపై భక్తితో వచ్చే మహిళలను మాయమాటలు చెప్పి వారిని భయభ్రాంతులకు గురిచేసి తన కామవాంఛ తీర్చుకుంటున్న దర్గా పీఠాధిపతి హాఫీజ్‌పాషాను తొలగించి దర్గా పవిత్రతను మహిళల మనులు బలికాకుండా కాపాడగలరని కోరారు. హాఫీజ్‌పాషాకు అతని చీకటి కార్యక్రమాలకు పూర్తిగా సహకరిస్తున్న వారి పేరుపై కేసు నమోదు చేసి దర్గా విధుల నుంచి తొలగించి గతంలో మాదిరి జడ్జీ పాలనలో దర్గాను కొనసాగించాలని కోరుతున్నారు. పలు కేసుల్లో నిందితునిగా ఉన్న హాఫీజ్‌ను పదవి నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా వక్ఫ్‌బోర్డ్ వారిని కోరినట్లు ఐద్వా మహిళా సంఘం తెలిపింది. జిల్లా ఐద్వా కార్యదర్శి మస్తాన్‌బీ, అధ్యక్షురాలు శివకుమారి, ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, జిల్లా సెక్రటేరియట్ కార్యవర్గ సభ్యులు గుల్జారు బేగం, ప్రమీల, శంషాద్ బేగం, ఆత్మకూరు ఐద్వా కమిటీ సభ్యులు సుమతి, ఎస్ పద్మ, వి.పద్మ, జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు గంట లక్ష్మీపతి, ఎఎస్‌పేట సిపిఎం నాయకులు అస్లామ్, గౌస్‌బాషా తదితరులున్నారు.

కావలి మున్సిపాలిటీలో ప్రక్షాళన చేస్తాం..

మాట్లాడుతున్న ఆర్‌డిఒ శీనానాయక్

ప్రజాశక్తి - కావలి

కావలి మున్సిపాలిటీలో ఎంఎల్‌ఎ సహకారంతో ప్రక్షాళన కార్యక్రమం చేపడుతున్న ప్రత్యేకాధికారి, ఆర్‌డిఒ శీనానాయక్ తెలిపారు. సోమవారం కావలి సిబ్బందితో మున్సిపల్ ప్రత్యేకాధికారి, ఆర్‌డిఒ వికె శీనానాయక్, మున్సిపల్ డి.ఇ. శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందున్న అనేక సవాళ్లను సమన్వయంతో ఎదుర్కోవాలన్నారు. ఎంఎల్‌ఎ సహకారంతో కావలి మున్సిపాలిటీలో కొన్ని మార్పులు తీసుకురావాలని ప్రక్షాళన కార్యక్రమం చేపట్టనున్నామని ఆయన తెలిపారు. మున్సిపాలిటీని ప్రత్యేకాధికారి పాలనలో మున్సిపాలిటీని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు మంచి సేవలు అందించే క్రమంలోవాటర్ సప్లై, లైటింగ్, టౌన్‌ప్లానింగ్, పందులబెడద, పారిశుధ్యం తదితర పనులపై ప్రజలకు మంచి సర్వీసు ఇచ్చేందుకు ప్రణాళికతో మార్పులు తీసుకురావాలన్నారు. నెలా, 2నెలలలోపు మున్సిపాలిటీని ఆధునికంగా తీర్చిదిద్దుతామన్నారు. 350మంది పారిశుధ్యకార్మికులు, 4శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 27మంది సెక్రటరీలు, మరో 27మంది మేస్త్రీలు ఉన్నారని, వారందరినీ సమన్వయపరిచి మంచిపాలన అందించేందుకు సమీక్షా సమావేశం నిర్వహించామన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని పగవారిపాలెంలో జగనాసుర రక్తచరిత్ర పుస్తకాన్ని సోమవారం కోవూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ జాతీయ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జగనాసుర రక్తచరిత్ర బహిరంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నామన్నారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య విషయంలో వైసిపి నాయకుల డ్రామాలు చేస్తున్న తీరు హాస్యాస్పదమన్నారు. రాజకీయ లబ్ధి కోసం కుటుంబ సభ్యులను చంపుకోవడం కేవలం వైసిపి నాయకులకే చెల్లుబాటు అవుతుందన్నారు. సిబిఐ నిష్పక్షపాతంగా వ్యవహరించి నేరస్తులను కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం మాజీ ఎంఎల్‌ఎ పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ముదివర్తి నుండి ముదివర్తిపాలెం కాజ్‌వేకు టెండర్లు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. కాజ్‌వే నిర్మాణం చేస్తేనే మళ్లీ ఓట్లకు ప్రజల వద్దకు వస్తానన్న ప్రసన్న ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వస్తారని ప్రశ్నించారు. కాజ్‌వే నిర్మాణం గురించి కోవూరు నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్ర చౌదరి, జిల్లా కార్యనిర్వాక కార్యదర్శి చెంచు కిషోర్ యాదవ్, మైనార్టీ నేత ఎస్.కె.ఇంతియాజ్, అధికార ప్రతినిధి చెముకుల కృష్ణచైతన్య, కొండూరు సుధాకర్ రెడ్డి, మునగాల రంగారావు, లెనిన్, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వలేని స్థితిలో ఎపి

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అల్లూరు

సకాలంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని ఆర్థిక వ్యవస్థలో రాష్ట్రం కొట్టుమిట్టాడుతుందని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ జెడ్‌పిటిసి బీద గిరిధర్, బండి శ్రీనివాసులరెడ్డి, నెల్లూరు నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నార్త్ మోపూరు గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి చేపట్టి విస్తృతంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ నేతలు మాట్లాడుతూ సాక్షాత్తు పార్లమెంటులో కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ఎపిలో సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని జగన్ సర్కారుపై తీరుపై మండిపడ్డారన్నారు. ఆనాడు పాదయాత్రలో ఆలింగనం చేసుకుని ముద్దులుపెట్టి నేనున్నానంటూ జగన్ రాష్ట్ర ప్రజలను మాయ చేశారని దుయ్యబట్టారని తెలిపారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తానంటూ నమ్మించి మోసం చేశారన్నారు. మద్యపాన నిషేధం చేపడతానని ప్రగల్భాలు పలికి రూ.20 స్పిరిట్‌ను రూ.200 విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నందమూరి తారక రామారావు ఈ దేశంలో మొట్టమొదటగా పింఛన్ పథకాన్ని ప్రవేశపెట్టారని తదుపరి చంద్రబాబు నాయుడు తన పథకాన్ని రూ.1000లకు తీసుకువచ్చారని తెలియజేశారు. ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి సవాలక్ష కారణాలతో ఉన్నవి తీసివేస్తూ పేద ప్రజలపై ఉక్కుపాదం మోపుతున్నారని ఎద్దేవా చేశారు. నవరత్నాలు నవ మోసాలని చలోక్తులు విసిరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైందని తద్వారా రైతులు ఎంతోమంది తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. విద్యుత్ బిల్లులు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే ఈ ప్రభుత్వం చోద్యం చూస్తుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. టిడిపి నాయకులు రామిశెట్టి కృష్ణచైతన్య, విడవలూరు దశరథ రామిరెడ్డి అరగల రమణయ్య, కత్తుల శ్రీకాంత్, కావలి జగన్మోహన్ రావు, షేక్ నజీర్‌బాషా తదితరులున్నారు.

పారిశ్రామికాభివృద్ధికి సహకారం అందించండి


ఎపిఐఐసి ఎమ్‌డితో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ మేకపాటి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజకవర్గంలో పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు సహకారం అందించాలని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అమరావతిలోని ఎపిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ డాక్టర్ గుమ్మల శ్రీజన, ఐఎఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పారిశ్రామికంగా ఆత్మకూరు నియోజకవర్గంలో ఏ విధంగా అభివృద్ధి చెయ్యవచ్చో అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు తన సోదరుడు, మాజీ పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు మండలం నారంపేట సమీపంలో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేశారన్నారు. ఈ పార్కు ఏర్పాటు చేసిన సమయంలో ప్లాస్టిక్ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు సైతం ప్రకటించారన్నారు. కానీ ఇంతవరకు నారంపేట సమీపంలోని ఎంఎస్ఎంఇ పార్కులో ఎటువంటి పరిశ్రమలు ఏర్పాటు కాలేదని, దీనికి గల కారణాన్ని తెలుసుకొనగా పారిశ్రమల ఏర్పాటుకు ఇచ్చే భూమి లీజు చాలా అధికంగా ఉందని పారిశ్రామికవేత్తలు భావించి ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి మొదటి 25 శాతం ప్లాట్లను మార్కెట్ ధరకు కనీసం 50 శాతం రాయితీని కల్పిస్తే పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతారని, దీంతో ఆత్మకూరు నియోజక వర్గం పారిశ్రామికంగా వృద్ధి చెందుతుందని భావిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

క్రైం కార్నర్

నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి-దగదర్తి

మండల పరిధిలోని దగదర్తి గ్రామానికి చెందిన వీర్ల వెంకటేశ్వర్లు అందిన ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు, నెల్లూరుకు చెందిన మరో ముగ్గురు వ్యక్తులు కలిసి తనపై దాడి చేసి, పరారైన వారిని అదుపులో తీసుకొని విచారించి కోర్టులో హాజరపరిచామన్నారు.

దుకాణంలో విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-బిట్రగుంట

మండల కేంద్రమైన బోగోలు బజారు సమీపాన ఉన్న 4వ నెంబర్ రేషన్ దుకాణంలో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సిఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ షాప్‌లో 380 కుటుంబాలకు గానూ 215 కుటుంబాలకు బియ్యం పంపిణీ చేసినట్లు, మిగిలిన బియ్యం 1800 కేజీలు ఉండాల్సి ఉండగా రేషన్ షాపులో బియ్యం నిల్వలు లేవని గుర్తించినట్లు తెలిపారు. రేషన్ డీలర్‌పై 6ఎ కింద కేసు నమోదు చేసి జెసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. తనిఖీలలో మైనింగ్ ఏజీ సుబ్బయ్య, హెడ్ కానిస్టేబుల్ బాబ్జి, రమణయ్య, నరేష్, ఆర్ఐ శ్రీధర్, విఆర్ఒ కిరణ్ పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలలో చోరీ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం వెంగళరావు నగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. వివరాల మేరకు.. కంప్యూటర్ గది తలుపుల తాళాలు పగలగొట్టి, దొంగలులోనికి ప్రవేశించారు. కంప్యూటర్లకు అమర్చిన ఇన్వర్టర్లకు ఉన్న 20 బ్యాటరీలు చోరీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం సుబ్బారావు ఫిర్యాదు మేరకు కావలి రెండో పట్టణ పోలీసులు పాఠశాలలో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బేల్దారి దుర్మరణం

ప్రజాశక్తి-కొడవలూరు

ముందు వెళుతున్న మినీ కంటైనర్‌ను బైక్ ఢీకొనడంతో బేల్దారి దుర్మరణం చెందారు. ఈసంఘటన మండలంలోని ఇఫ్కో కిసాన్ సెజ్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జలదంకి మండలం, చామదల గ్రామానికి చెందిన వల్లెపు రమణయ్య (51) బేల్దారి పనులు చేస్తుంటారు. రోజూ లాగే సోమవారం నెల్లూరులో బేల్దారి పనికి వెళ్లిన రమణయ్య పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి బైక్ పై బయల్దేరారు. ఇఫ్కో కిసాన్ సెజ్ వద్ద వెళుతుండగా ముందు పోతున్న మినీ కంటైనర్ ఒక్కసారిగా స్లో చేయడంతో బైక్ అదుపు కాక కంటైనర్ను ఢీకొన్నారు. దీంతో మోటార్ సైక్లిస్ట్ రమణయ్య రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయమై అక్కడకక్కడే మతి చెందారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ జి.సుబ్బారావు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రాజకీయ నేతలు సహకరించాలి

ప్రజాశక్తి-మర్రిపాడు

త్వరలో జరుగనున్న ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నేతలు అధికారులకు సహకరించాలని, ఏవైనా సందేహాలున్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్ హేమంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తప్పకుండా ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను వివరించారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, మండల వైసిపి కన్వీనర్ బోర్రా వెంకట సుబ్బారెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, టిడిపి ఆరికట్ల జనార్దన్‌నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్ రెడ్డి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : మార్చి 13న జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికలను డివిజన్ పరిధిలోని అన్ని మండలాలలో పకడ్బంధీగా నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆత్మకూరు ఆర్‌డిఒ కరుణకుమారి అన్నారు. సోమవారం ఆత్మకూరు ఆర్‌డిఒ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మార్చి 13న జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికలలో ఓటర్ల జాబితాలు పూర్తయినట్లు ఆమె తెలిపారు. ఎన్నికలు నిర్వహించేందుకు మండలానికి ఒక పోలింగ్ స్టేషన్ చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పట్టభద్రుల ఎన్నికల కోసం పోలింగ్ స్టేషన్లో ఉండగా మరో మూడు పోలింగ్ కేంద్రాలు కావాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఎన్నికలకు మూడు పోలింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. ఎన్నికల కోడ్ అమలైందని, ఎన్నికల జరిగే పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే ఆయా మండలాల రెవెన్యూ అధికారులు పోలీసులు పరిశీలించారు. తాను పోలింగ్ స్టేషనులను సందర్శించినట్లు తెలిపారు. కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వాటిని పాటించాలన్నారు. మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న గ్రిగ్ పోటీలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని నరసాపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో రెండవ రోజు 98వ గ్రిగ్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.పల్లవి మీడియాకు వెల్లడించారు. కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్ పోటీలలో 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. క్రీడాకారులకు భోజన వసతులు సమకూర్చడంలో స్థానిక పారిశ్రామికవేత్త దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి సహకరించినట్లు తెలిపారు. మూడోవ రోజు 14న ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమాల్లో ఇందుకూరు పేట గర్ల్స్ హై స్కూల్ హెచ్‌ఎం ఝాన్సీలత, నర్సాపురం హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వర రావు కార్యక్రమ వ్యాఖ్యాత ఉమా కిరణ్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, దశయ్య, శ్రీనివాసులు, ముజీర్, కృష్ణ మోహన్, రేణుక, బివి రమణయ్య, నరసయ్య పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ ఆరోగ్య పరిస్థితులపై ఆరా

ఎంఎల్‌ఎను కలిసిన ధనుంజయరెడ్డి

ప్రజాశక్తి-ఉదయగిరి

ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితులను నియోజక వర్గ పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి అడిగి తెలుసుకున్నారు. సోమవారం మర్రిపాడులోని ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అతిథి భవనంలో ఆయన మర్యాద పూర్వకంగా కలిసి ప్రస్తుత ఆరోగ్య పరిసరను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉదయగిరి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ అక్కి భాస్కర్ రెడ్డి, ఉపసర్పంచ్ ముర్తుజా హుస్సేన్, మాజీ మండల కన్వీనర్ మూలే సుబ్బారెడ్డి, ఇత్తడి రమణయ్య, తదితర వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల పరిధిలోని కొండయ్యపాలెం - పామూరుపల్లె వెళ్లే రోడ్డు నిర్మాణం చాలా అధ్వానంగా తయారైంది. ఆ రోడ్డు వేసి ఎన్నో ఏళ్లు గడవడంతో ప్రస్తుతం ఆ రోడ్డు గ్రావెల్ రోడ్డును దర్శనమిస్తుంది. రోడ్డు పొడవునా తారు లేచిపోయి కంకర రాళ్లు బయటపడి గోతులతో దర్శన మిస్తున్నాయి. ఆ రోడ్డు వైపు ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు హడలి పోతున్నారు. ఎంతోమంది రాజకీయ నాయకులు ఇటువైపు వస్తున్నారే కానీ పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేసి ఆదుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల విజేత ప్రకాశం

ప్రజాశక్తి-కోవూరు

జిల్లాలోని కోవూరులో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి ప్రకాశం జిల్లా కప్పు కైవసం చేసుకుంది. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో నెల్లూరు జట్టు 28 పాయింట్లు దక్కించుకోగా ప్రకాశం జిల్లాకి 33 పాయింట్లు రావడంతో ఐదు పాయింట్ల ఆధిక్యంతో ప్రకాశం జిల్లా నిలిచి 50 వేల రూపాయల నగదు బహుమతిగా గెలుచుకుంది. ఈ కబడ్డీ పోటీల్లో మొత్తం 8 జిల్లాలకు పాల్గొనగా తొలుత నెల్లూరు, కృష్ణా జిల్లాకు పోటీలు జరిగాయి. గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ స్థానంలో నిలిచిన జట్లకు మెమెంటో కప్పులను రాష్ట్ర వ్యవసాయ సహాయక మండలి సభ్యులు నిరంజన్ బాబు రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతి రావు, కోవూరు సిఐ రామకష్ణారెడ్డి అందించారు. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్ల అంకయ్య, ఉపాధ్యక్షులు రంగారావు, రాష్ట్ర కబడ్డీ రెఫరీస్ బోర్డు చైర్మన్ బాలస్వామి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లవకుమార్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.విజయ బాబు, జాన్సన్, విజయానందం,సింహాద్రి, తదితరులు క్రీడాకారులు పాల్గొన్నారు.

In The Court of The IIIrd Addl. Junior Civil Judge : Nellore

O.S.No. 1352 / 2019

Shaik Yusuf - Plaintiff

Vs

1. Sk.Zeheerunisa
and 18 others - Defendants

దావా నోటీసు

D16. Shaik Nasreen,
W/o **Shaik Baji,** Residing at D.No. 20-4-454, Mansoor Nagar, Meclines Road, Kotamitta, Nellore City, SPSR Nellore District, PIN: 524001.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తేది: 13-3-2023** దిన వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

గుంజి దయాకర్, బి.ఎ., బి.ఎల్.,
వాది తరపు న్యాయవాది, నెల్లూరు.

In The Court of The IIIrd Addl. Junior Civil Judge : Nellore

I.A.No. 1058 / 2019

O.S.No. 1352 / 2019

Shaik Yusuf - Petitioner / Plaintiff

Vs

1. Sk.Zeheerunisa
and 18 others -Respondents/Defendants

ఐ.ఎ. నోటీసు

R16. Shaik Nasreen,
W/o **Shaik Baji,** Residing at D.No. 20-4-454, Mansoor Nagar, Meclines Road, Kotamitta, Nellore City, SPSR Nellore District, PIN: 524001.

పై నెంబరు కేసులో పిటిషనర్ /వాది మీమీద పై వారి కోర్టులో **I.A.1058/2019** పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తేది: 13-3-2023** దిన వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

గుంజి దయాకర్, బి.ఎ., బి.ఎల్.,
పిటిషనరు / వాది తరపు న్యాయవాది, నెల్లూరు.